వరంగల్ సభ ఏర్పాట్లు పరిశీలించిన కూసుకుంట్ల

- మాజీ ఎమ్మెల్యే వెంట వెళ్లిన స్థానిక నాయకులు

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, ఏప్రిల్ 20 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సభ పనులను పర్యవేక్షించేందుకు పార్టీ స్థానిక నేతలతో కలిసి ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తికి వెళ్లారు. అక్కడ ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ అనేక పోరాటాలు చేసి తెలంగాన రాష్ట్రాన్ని సాధించారన్నారు. గతంలో సీఎంగా కేసీఆర్ పదేండ్లపాటు ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. సబ్బండ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందు కోసం మరోసారి కేసీఆర్ సీఎం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు చింతల దామోదర్‌రెడ్డి, గిర్కటి నిరంజన్‌గౌడ్, పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ముటుకుల్లోజు దయాకరాచారి, ఢిల్లీ మాధవరెడ్డి, సుర్వి మల్లేశ్‌గౌడ్, ఊడుగు మల్లేశం గౌడ్, గుండెబోయిన వెంకటేశం యాదవ్, అంజయ్య, పరమేశ్, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, పర్వతాలు, బాలరాజు ఉన్నారు.

దోనూరి సుశీల మృతి పార్టీకి తీరని లోటు : కూసుకుంట్ల

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, కొత్తగూడెం గ్రామ మాజీ సర్పంచ్ దోనూరి సుశీల మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సుశీల అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆదివారం ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్రి నర్సింహ, నాయకులు మన్నె ఇంద్రసేనారెడ్డి, జక్కర్తి పాపయ్య, బీరయ్య, జంగయ్య ఉన్నారు

బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న తిమ్మాపురం భూ నిర్వాసితులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. తిమ్మాపురం నిర్వాసితులు ఆదివారం హైదరాబాద్‌లో శేఖర్‌రెడ్డిని కలిసి ప్రభుత్వం భూ నష్టపరిహారం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిర్వాసితులకు భూముల నష్టపరిహారం అందించామన్నారు. గ్రామంలో ఉన్న కుటుంబాలకు, 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు 1,067 మందికి రూ.7,60,000 చొప్పున ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించామని తెలిపారు. పట్టణ పరిధిలోని హుస్సేనాబాద్ వద్ద 1,067 మందికి 200 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించి పట్టాలు సైతం అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులకు అన్ని విధాలా అన్యాయం చేసిందని, వారికి రావాల్సిన ఇండ్ల నష్టపరిహారం, భూముల నష్టపరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై పోరాడి నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారాన్ని ఇప్పించే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పైళ్లను కలిసిన వారిలో తక్కెళ్ల రమేశ్‌రెడ్డి, పాల సంఘం మాజీ చైర్మన్ మోర రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, భూ నిర్వాసితులు ఉన్నారు.

'గ్రామపంచాయతీలో అవినీతి, అక్రమాలను బయటపెట్టాలి'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలను సంబంధిత అధికారులు బహిర్గతం చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు(ఎం) గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై వివరాలు ఇవ్వాలని గ్రామానికి చెందిన హైమద్ సమాచార హక్కు చట్టం కింద 3నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. కలెక్టర్‌తోపాటు జిల్లా పంచాయతీ అధికారి వెంటనే స్పందించి గ్రామసభను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి సమాచారం ఇవ్వని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు, యువజన విభాగం మండలాధ్యక్షుడు ప్రతి కంఠం శంతన్‌రాజ్, నాయకులు నర్సింహ, సతీశ్, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

అనాజిపురంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మోత్కూరు, ఏప్రిల్ 20 : వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి ప్రజలను అధిక సంఖ్యలో తరలించాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో ఆదివారం సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ పార్టీగా రాష్ట్రాన్ని సాధించి పదేండ్లలో ప్రజలకు అందించిన సంక్షేమాలను వివరించి సభకు ప్రజలను ఎక్కువ సంఖ్యలో తరలించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని అనాజిపురంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, నాయకులు రాంపాక నాగయ్య, వల్లందాసు వెంకటయ్య, కొల్లు శంకర్, మాజీ సర్పంచ్ ఉప్పల లక్ష్మీయాదయ్య, యువజన విభాగం నాయకులు కూరెళ్ల పరమేశ్, వీరపెద్దులు, శ్రీను, వెంకన్న, రాజు, గంగులు, ఎల్లయ్య, ఇంద్రశేఖర్, అశోక్, సైదులు, రమేశ్ పాల్గొన్నారు.

గౌస్‌కొండ మాజీ సర్పంచ్‌కు సన్మాన పత్రం బహూకరణ

లావణ్య, దేవేందర్‌రెడ్డి దంపతులకు సన్మాన పత్రం బహూకరిస్తున్న కవి పాండాల మహేశ్వర్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 20 : మండలంలోని గౌస్‌కొండ గ్రామ మాజీ సర్పంచ్ ఫకీరు లావణ్య, దేవేందర్‌రెడ్డి దంపతులను గౌస్‌కొండ పోతన రచయిత డాక్టర్ పాండాల మహేశ్వర్ ఆదివారం సత్కరించి మెమెంటో సన్మాన పత్రం బహూకరించారు. సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మన్నె శ్రీనివాసరెడ్డి, మునుకుంట్ల సుమన్, మల్లేశ్ గౌడ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈదురుగాలుల వర్షానికి రైతన్న ఆగమాగం

- పలు మండలాల్లో భారీ వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం.. కూలిన చెట్లు

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం

మోత్కూరు, ఏప్రిల్ 20 : జిల్లాలో పలుచోట్ల ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మోత్కూరు అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల్లో అకాల వర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల వర్షపు నీటిలో వడ్లు కొట్టుకుపోయాయి. చెట్లు విరిగిపడ్డాయి. జిల్లాలో నెల రోజులుగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎక్కువ మంది రైతులు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసుకొని కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. కాంటాలు సక్రమంగా కాకపోవడంతో రైతులు రాశుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో ఈదురుగాలులతో కురిసిన వానకు ధాన్యం తడిసి ముద్దయింది. గాలికి మామిడి కాయలు నేలరాలడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌తో పాటు పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. వరద నీటికి కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వలిగొండ : టేకులసోమారం సమీపంలో భువనగిరి – నల్లగొండ ప్రధాన రహదారిపై కూలిన చెట్టు

మోటకొండూర్ మండలంలోని చాడ వద్ద రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న ఎస్ఐ, పోలీసు సిబ్బంది

వలిగొండ మండలంలో..

వలిగొండ : మండలంలోని టేకులసోమారం, పహిల్వాన్‌పూర్ గ్రామాల్లో అర్ధగంటపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఈదురుగాలులకు టేకులసోమారం వద్ద భువనగిరి – నల్లగొండ ప్రధాన రహదారికి అడ్డంగా భారీ వృక్షాలు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పహిల్వాన్‌పూర్ – టేకులసోమారం గ్రామాల మధ్య రోడ్డుపై అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను పోలీసులు జేసీబీలతో తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

మోటకొండూరు మండలంలో..

మోటకొండూర్ : మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వాన పడింది. చాడ గ్రామంలో ఈదురుగాలులకు చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దాంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడగా.. విషయం తెలుసుకున్న పోలీసులు చెట్లను తొలగించారు.

మే 15న పోచంపల్లికి అందాల భామలు

- సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న టూరిజం పార్క్

టూరిజం భవనం

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 20 : ప్రపంచ పర్యాటక కేంద్రం భూదాన్ పోచంపల్లికి వచ్చే నెల 15న అందాల భామలు రానున్నారు. హైదరాబాద్‌లో మే 27నుంచి 31వరకు మిస్ వరల్డ్ – 2025 పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ప్రపంచ దేశాల సుందరీమణులు పోచంపల్లిలో పర్యటించనున్నారు. 40 దేశాలకు చెందిన అందాల భామలకు పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ ఆతిథ్యం ఇవ్వనున్నది. మిస్ వరల్డ్ పోటీల్లో 140 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొననున్నారు. వారిని బృందాలుగా విభజించి తెలంగాణ సాంప్రదాయాలను పరిచయం చేయడానికి ప్రముఖ ప్రదేశాలు, దేవాలయాలను సందర్శింపజేయనున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు పోచంపల్లిని సందర్శించి తెలంగాణ చేనేత వారసత్వం, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ చేనేత వస్త్రాలను ఫ్యాషన్ ప్రపంచానికి మరింత చేరువ చేసి నేతన్నలకు అండగా నిలిచేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం టూరిజం పార్కు సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ప్రపంచ సుందరీమణులు ఆకర్షించేలా పోచంపల్లి బ్రాండ్ ఇక్కత్ చేనేత వస్త్రాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. పోచంపల్లి ఇక్కత్‌తో పాటు గొల్లభామ, గద్వాల, నారాయణపేట తదితర చేనేత వస్త్రాలతో గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. టూరిజం ప్రాంగణంలో చేనేత కళాకారులతో మగ్గాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. విదేశీ ప్రతినిధుల కోసం పోచంపల్లిలో తెలంగాణ జానపద కళాకారుల ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5నుంచి రాత్రి 8:30 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందాల పోటీల్లో పాల్గొనే ఓ బృందం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని దర్శించనుంది. ఫ్యాషన్ ప్రపంచానికి ప్రతీకగా నిలిచే ఐరోపా దేశాల ప్రతినిధులతో పోచంపల్లి వస్త్రాలను ధరింపజేసి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకురావాలని, వాటిని ప్రమోట్ చేయాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చేనేత వారసత్వాన్ని, తెలంగాణ సాంస్కృతిక వస్త్రాలను ప్రపంచ ప్రేక్షకులకు చూపించడానికి మే 15న చేనేత ఐకానిక్ పోచంపల్లి మిస్ వరల్డ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఇందుకోసం టూరిజం సెంటర్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : గ్రామాల్లో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందున కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని పేర్కొన్నారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మోత్కూరు, ఏప్రిల్ 20 : మండలంలోని పాటిమట్ల క్రాస్ రోడ్డు సమీంలో వలిగొండ – తొర్రూర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని నిదానపురం గ్రామానికి చెందిన కాగు గణేశ్ (21), తన స్నేహితుడు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం వెంపటి గ్రామానికి చెందిన పులిబచ్చల సంపత్‌తో కలిసి ఆదివారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గ మధ్యంలో మోత్కూరు మండలంలోని పాటిమట్ల క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను అతి వేగంతో బైక్ ఢీకొట్టింది. దాంతో కిందపడిన గణేశ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంపత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మోత్కూరు, ఏప్రిల్ 20 : మండలంలోని పొడిచేడు గ్రామంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి (52) హైదరాబాద్‌లోని తార్నాకలో ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడిన ఆయన.. భార్యాపిల్లలను వదిలేసి తిరుగుతున్నాడు. శనివారం మోత్కూరులో నకిరేకల్‌కు వెళ్లే బస్సు ఎక్కి పొడిచేడు గ్రామంలో దిగాడు. అక్కడే తిరుగుతూ కనిపించాడు. ఎవరి బంధువోనని గ్రామస్తులు అనుకున్నారు. మద్యం తాగి బస్ షెల్టర్ సమీపంలోని కల్వర్టుపై పడుకున్నాడు. ఆదివారం ఉదయం కల్వర్టు కింద పడి మృతిచెంది ఉండగా.. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడంతో రామన్నపేట మార్చురీకి తరలించారు. ఫిర్యాదు రాలేదని ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

రాజాపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వెంకటరమణ

రాజాపేట, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా చిన్నం వెంకటరమణను ఆదివారం ఆ సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘం నాయకులు, కులస్తులకు అభినందనలు తెలిపారు.

'పాల రైతుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

పాల రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు గౌడ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : పాల రైతులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఐదు రూపాయల ప్రోత్సాహకాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మటూరి బాలరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో మదర్ డెయిరీ పాల కేంద్రం వద్ద ఆదివారం రైతులతో కలిసి పాడి రైతుల సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ మదర్ డెయిరీకి సంబంధించిన ఐదు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టాల పేరుతో మదర్ డెయిరీ సంస్థ ఆస్తులను విక్రయించద్దన్నారు. పాడి రైతులకు బీమా సౌకర్యం కల్పించి ఆ బీమా మొత్తాన్ని చెల్లించాలని, సబ్సిడీపై దాణాను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న ఆలేరులో జరిగే పాల రైతుల రాష్ట్ర సదస్సులో పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ నాగు క్రాంతికుమార్, మాజీ చైర్మన్ ఎల్లంల వెంకటేశ్, పాడి రైతులు గొర్ల జంగయ్య, జిట్ట రవీందర్ రెడ్డి, బత్తిని వెంకటేశం, కంబాలపల్లి జంగయ్య, బత్తిని దశరథ, కంబాలపల్లి నర్సింహ, ఎల్లంల ఐలయ్య పాల్గొన్నారు.

29న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 20 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 29న పాదయాత్ర, కలెక్టరేట్ వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు మంచాల మధు కోరారు. పట్టణంలో ఆదివారం మహాధర్నా కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో సాగునీటి సమస్య కీలకంగా ఉందన్నారు. రెండు దశాబ్దాలు కావస్తున్నా బస్వాపురం రిజర్వాయర్ పనులు పూర్తి కాలేదని, మూసీ జల కాలుష్యంతో ప్రజల బతుకులు ఆగమవుతున్నా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని గోదావరి, కృష్ణా జలాలను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి, బునాదిగాని కాల్వ పనులు పూర్తికాలేదని విమర్శించారు.

కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బుగ్గల లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, నాయకులు ఉప్పునూతల యాదగిరి, రజినీకాంత్, రాజయ్య, అనసూయ, శ్రీనివాస్, కిశోర్ పాల్గొన్నారు.

బీసీడబ్ల్యూయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజాపేట, ఏప్రిల్ 20 : ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (బీసీడబ్ల్యూయూ) మహాసభల పోస్టర్‌ను మండలంలోని బేగంపేట గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెల్ల బాహుపేట వెంకటయ్య, సీపీఐ మండల కార్యదర్శి చిగుర్ల లింగం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే మహాసభలకు కార్మికులు భారీ సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి మూల హరినాథ్, నాయకులు నీల నర్సింహులు, కర్రె బాలరాజు, మల్లేశం, జహంగీర్ పాల్గొన్నారు.

ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 20 : ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని భువనగిరి పట్టణంలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా కె.సోమయ్య, అధ్యక్షుడిగా బొల్లెపల్లి కుమార్, ప్రధాన కార్యదర్శిగా మామిడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తడక మోహన్, జగతయ్య, నేహాల్, సహాయ కార్యదర్శులుగా సీస శ్రీనివాస్, సుదగాని శ్రీహరి, చింతల రాజశేఖర్, కోశాధికారిగా బొడ్డు కిషన్ ఎన్నికయ్యారు.

భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా సుధాకర్ బాధ్యతలు

బాధ్యతలు చేపడుతున్న కె.సుధాకర్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా కె.సుధాకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు రూరల్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న వి.సంతోష్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మీర్‌పేటలో పనిచేసిన సుధాకర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌కు సంతోష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి జన్మదిన వేడుకలు

రామన్నపేటలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 20 : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని సుభాశ్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి కేక్ కట్ చేశారు. అనంతరం నార్కట్‌పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, నాయకులు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, అంతటి రమేశ్, బద్దుల రమేశ్, సాల్వేరు అశోక్, వేమవరపు సుధీర్‌బాబు, పున్న వెంకటేశం, రేఖ యాదయ్య, దుర్గయ్య, బలరాం, శ్రీనివాస్‌రెడ్డి, మత్తయ్య, సంతోష్, మల్లేశం, చాంద్, ప్రవీణ్, నర్సింహ, కిషన్, శివ, రాము, నరేశ్, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

'మహిళలను గుడి నుంచి గెంటేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

తాళ్ల రాంపూర్ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 20 : నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ మహిళలను గుడి నుంచి గెంటివేసి గౌడ కుటుంబాలను బహిష్కరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సుభాశ్ సెంటర్‌లో ఆదివారం గౌడ సంఘం నాయకులు తాళ్ల రాంపూర్ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న శ్రీరామనవమి సందర్భంగా పూజ కోసం గౌడ మహిళలు గుడికి వెళ్తే అవమానించి గెంటివేశారన్నారు. 150 ఈత చెట్లను తగలబెట్టి వృత్తి చేసుకొని బతికే వారి పొట్ట గొట్టారని విమర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గౌడ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కూనూరు మల్లేశం, మునుకుంట్ల లెనిన్, బావండ్లపల్ల